క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన అవ్వారి దినేష్‌కుమార్ రూ.1,00,120 విరాళాన్ని శనివారం అందజేశారు.ఈ మొత్తాన్ని ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను అర్చకులు స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు, అర్చకులు పాల్గొన్నారు.

రచ్చబండ నిర్మాణానికి భూమిపూజ



మనుబోలు: మడనూరులోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద రచ్చబండ నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు శ్రీ సేవానాథం ట్రస్ట్ ఫౌండర్ మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి రూ.3 లక్షల వ్యయంతో రచ్చబండ నిర్మిస్తున్నట్లు ఆ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు బొల్లు రాంప్రసాద్, పల్లంపర్తి మహిధర్‌రెడ్డి, కే భార్గవ్, నిరంజన్‌రెడ్డి, గిరి పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిపై దాడి చేసిన నిందితుడిపై వేదాయపాళెం పోలీసులు కేసును శనివారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. చంద్రమౌళీనగర్‌లో నివాసం ఉంటున్న వెంకటాచలం మండలం నిడిగుంటపాళేనికి చెందిన బాలయ్య మార్నింగ్ వాక్‌కు ఈ నెల 19న వెళ్లారు. ఎన్నెస్సార్ విగ్రహం వద్దకు వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తి అతనిపై కారం పొడిచల్లి రాయితో దాడి చేసి కాళ్లు, చేతులతో కొట్టారు. బాలయ్య పెద్దగా కేకలేయడంతో స్థానికులు రావడాన్ని గమనించిన నిందితుడు పరారయ్యారు. దాడి చేసిన వ్యక్తి ఎవరనే అంశాన్ని ఆరాతీయగా, నిడిగుంటపాళేనికి చెందిన ప్రసన్నకుమార్‌గా తేలింది. గతంలో ప్రసన్నకుమార్‌కు అదే ఊర్లోని ఓ మహిళకు వివాదం ఉంది. ఆ గొడవను బాలయ్య సర్దుబాటు చేయడంతో ప్రసన్నకుమార్ కక్ష పెంచుకొని దాడికి పాల్పడ్డారు. ఘటనపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.

సురక్షిత మాతృత్వం..ఖర్చు లేకుండా



➡ ఈమె పేరు తుపాకుల వెంకటశేషమ్మ. టీపీగూడూరు మండలం వరిగొండకు చెందిన ఈమెకు నెలలు నిండడంతో పడుగుపాడులోని బంధువులు ఏడ్రోజుల క్రితం కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. ఆమెను పరీక్షించిన వైద్యులు ఆరోగ్య పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్లు గుర్తించారు. సకాలంలో ఆపరేషన్ చేసి తల్లీబిడ్డకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పురుడు పోశారు. తొలి కాన్పు సురక్షితంగా జరగడంతో ఆమెతో పాటు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



➡ ఈమె పేరు యాకసిరి అమరావతి: కోవూరు మండలం ఇనమడుగుకు చెందిన ఈమెకు అకస్మాత్తుగా నొప్పులు రావడంతో రెండ్రోజుల క్రితం కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. ఆమె ఆరోగ్య పరిస్థితి ప్రమాదకరంగా ఉందని గుర్తించిన వైద్యులు వెంటనే శస్త్రచికిత్స చేసి సురక్షితంగా తొలి కాన్పు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు సురక్షితంగా కాన్పు చేసి ఇంటికి పంపడంతో ఆమె ఆనందం వ్యక్తం చేశారు.



కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రం

మాతృత్వం అనేది ఓ వరం.. ప్రసవ ఘట్టం మహిళలకు పునర్జన్మ వంటిది. దీనిని కొందరు స్వార్థపరులు తమ సంపాదనకు మార్గంగా మలుచుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో సురక్షిత మాతృత్వాన్ని ఉచితంగా ప్రసాదించాలని ప్రభుత్వం భావించింది. ప్రసూతి సేవలు అందిస్తున్న ఆస్పత్రులపై ప్రత్యేక దృష్టి సారించి సౌకర్యాలను మెరుగుపరిచింది. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వైద్యులు మెరుగైన సేవలను అందిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

కోవూరు: రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేస్తోంది. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తోంది. ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు అవసరమైన మౌలిక వసతులు సమకూర్చడంతో పాటు వైద్యులను నియమించి మెరుగైన వైద్యసేవలను అందిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులకు సురక్షిత మాతృత్వ సేవలను ఖర్చు లేకుండా ఉచితంగా అందిస్తోంది. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వైద్యులు సురక్షిత కాన్పులు చేసి తల్లీబిడ్డను క్షేమంగా ఇంటికి పంపుతున్నారు. కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వం దాదాపు రూ.70 లక్షలతో మౌలిక వసతులు కల్పించింది. 8 మంది వైద్యులను నియమించింది. దీంతో వైద్యసేవలు మెరుగుపడ్డాయి. ఫలితంగా గతంలో రోజుకు 200 ఓపీలు వస్తుండగా, ప్రస్తుతం 500కు పైగా ఓపీలు నమోదవుతున్నాయి. గర్భిణులకు సైతం మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. ప్రతినెలా సాధారణ కాన్పులు 15, సిజేరియన్‌లు 15కు పైగా చేస్తున్నారు. ల్యాబ్‌లో అత్యాధునిక వైద్యపరీక్షలు చేస్తున్నారు. నెలకు 5,500కుపైగా టెస్టులు చేస్తున్నారు. 350 మంది గర్భిణులకు స్కానింగ్‌లు, 150 మందికి ఎక్స్‌రేలు తీస్తున్నారు.

మెరుగైన వైద్య సేవలు

కోవూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి అత్యవసర వైద్యం కోసం వచ్చే రోగులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చికిత్స అందిస్తున్నాం. ప్రతీ వైద్యురాలు రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచేలా తరచూ పర్యవేక్షిస్తుండడంతోపాటు ఆదేశాలివ్వడం జరుగుతోంది. సీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలందుతుండడం వల్లే రోజురోజుకీ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

– డాక్టర్ విజిత, సూపరిండెంట్ సీహెచ్‌సీ, కోవూరు

సురక్షితంగా ఇంటికి

ప్రభుత్వాస్పత్రులకు ప్రసవం కోసం వచ్చే గర్భిణులకు రవాణా నుంచి మందుల వరకు అన్నీ ఉచితమే. గర్భిణులకు పురిటి నొప్పులు రాగానే 104కు ఫోన్ చేస్తే ఆస్పత్రికి తీసుకెళ్తారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బోధనాస్పత్రి వరకు ఎక్కడైనా వైద్యం చేయించుకోవచ్చు. ప్రసవానంతరం తల్లీబిడ్డలను క్షేమంగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఇంటికి చేరుస్తారు.

ప్రోత్సాహకాలు

పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో కాన్పు చేయించుకునే గర్భిణులకు ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలను అందజేస్తోంది. ఆరోగ్య ఆసరా కింద రూ.4,000, జననీ సురక్ష యోజన కింద మరో రూ.1000 ఇస్తోంది.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

• జేసీ రోణంకి కూర్మనాథ్



బుచ్చిరెడ్డిపాళెం: జగనన్న కాలనీల్లో చేపడుతున్న గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని సీ రోణంకి కూర్మనాథ్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని పెద్దూరులోని జగనన్న కాలనీ లేఅవుట్‌లో గృహ నిర్మాణాల పురోగతిని శనివారం జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోనే పెద్ద లేఅవుట్‌గా ఉన్న పెద్దూరు లేఅవుట్‌లో దాదాపు 650 ఇళ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 70 శాతానికి పైగా గృహ నిర్మాణాలను ప్రారంభించినట్లు చెప్పారు. మిగిలిన నిర్మాణాల పనులను ప్రారంభించి నిర్దేశించిన సమయానికి పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గృహ లబ్ధిదారులు, కాంట్రాక్టర్లు నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గృహ లబ్ధిదారులైన పొదుపు మహిళలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని అదనపు వసతులు సమకూర్చుకోవాలని కోరారు. గృహ నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలను ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ సుధీర్, గృహనిర్మాణ శాఖ సిబ్బంది మల్లి, కాంట్రాక్టర్ శేషయ్య ఉన్నారు.

కిరణ్ సేవలు వెలకట్టలేనివి



అక్కంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు దాత అందజేసిన బస్సును ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: అక్కంపేట పరిసర గ్రామాల ప్రజలకు మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. అక్కంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు వచ్చే చుట్టుపక్కల గ్రామాల విద్యార్థుల కోసం కిరణ్‌కుమార్‌రెడ్డి ఎన్ఎస్సార్ ఫౌండేషన్ ద్వారా రూ.25 లక్షల విలువైన నూతన బస్సును సమకూర్చారు. ఈ బస్సును మనుబోలులో మంత్రి కాకాణి శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అక్కంపేట ప్రాథమికోన్నత పాఠశాలను మూసేసేందుకు యత్నించగా, న్యాయస్థానాన్ని ఆశ్రయించి కాపాడుకున్న ఘనత కిరణ్‌ది అన్నారు. దాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాశాఖ ఉన్నతాధికారులను ఒప్పించి ఉన్నత పాఠశాలగా మార్పు చేయించారని కొనియాడారు. పాఠశాలకు వచ్చే పరిసర ప్రాంత విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం సొంత నిధులతో బస్సు సౌకర్యం కల్పించిన మొదటి వ్యక్తి కిరణ్ అని ప్రశంసించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, గుండాల ఆదినారాయణ, చిట్టమూరు నరసారెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, పూండ్ల శ్రీహరిరెడ్డి, పెనుమల్లి రామకృష్ణారెడ్డి, పోతుగుంట షబ్బీర్, ముంగర రవీందర్‌రెడ్డి, చిల్లకూరు వెంకటరెడ్డి, కేవీఆర్‌గౌడ్, ఏలూరు భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఉచితంగా 11రకాల సేవలు

• ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు(విడవలూరు): ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవసరమైన 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తోందని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. విడవలూరులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకాలు అందక నష్టపోకూడదనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటిని సర్వే చేసి ప్రజలకు అవసరమైన సేవలను గుర్తించి ఉచితంగా అందజేస్తారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలు ప్రభుత్వ సేవల కోసం మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. జన్మభూమి కమిటీలతో సంక్షేమ పథకాలు అందక పేదలు ఎంతో నష్టపోయారన్నారు. తమ ప్రభుత్వం అందుకు భిన్నంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకుపోతూ జగనన్న సురక్షను అమలు చేయడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రంలో 99 శాతానికి పైగా అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సాంకేతిక కారణాలతో మిగిలిన ఒక్క శాతం ప్రజలు నష్టపోకూడదన్నదే జగనన్న సురక్ష లక్ష్యమన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు చిత్తశుద్ధితో నిర్వహించాలన్నారు. వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది అర్హత ఉన్న వారందరికీ సర్టిఫికెట్లు జారీ చేయాలన్నారు.



మహిళకు ఇంటి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత

విడవలూరు మండలం అన్నారెడ్డిపాళేనికి చెందిన సోడం మనోజ తనకు ఇంటి స్థలం లేదని ఎమ్మెల్యే ప్రసన్నకు మొరపెట్టుకోగా స్పందించారు. వెంటనే ఇంటి పట్టా అందజేయడంతో ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక భద్రత ఉండాలన్న ఉద్దేశంతో లక్షల విలువ చేసే ఇళ్ల స్థలాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉచితంగా అందజేస్తున్నారని తెలిపారు. పేదలకు జగనన్న కాలనీల్లో ఇంటి పట్టా అందజేయడంతో పాటు ఇంటిని నిర్మించి ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పూండ్ల అచ్చుతరెడ్డి, వైఎస్సార్‌సీపీ గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ భవానమ్మ, జెడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య, సర్పంచ్ ప్రవీణ్, సొసైటీ చైర్మన్లు లక్ష్మీనారాయణరెడ్డి, సురేంద్రరెడ్డి, శ్రీహరిరెడ్డి, మస్తానయ్య, సంపూర్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై విస్తృత అవగాహన

• కలెక్టర్ హరినారాయణన్

తోటపల్లిగూడూరు: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న 11 రకాల సేవలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ హరినారాయణ అధికారులకు సూచించారు. చిన్నచెరుకూరు, సౌత్‌ఆములూరు గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వేను శనివారం ప్రారంభించారు. సౌత్‌ములూరులో జగనన్న సురక్ష సర్వేను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా ఉచితంగా 11 రకాల ప్రభుత్వ సేవలను అందిస్తోందన్నారు. అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలకు నోచుకోని వారిని గుర్తించి అందించనున్నట్లు తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సమష్టిగా విజయవంతం చేయాలన్నారు. తహసీల్దార్ హమీద్,ఎంపీడీఓ హేమలత, ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి, వైస్‌ఎంపీపీ చెరుకూరు శ్రీనివాసులనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ అధికారులకు సూచించారు. మండలంలోని పల్లిపాడులో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ బృందం ఇంటింటికి వెళ్లినప్పుడు వారితో స్నేహభావంతో మెలగాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందించే 11 రకాల సేవలను తెలియజేయాలని కోరారు. గ్రామంలో క్యాంపు జరిగే తేదీని ముందుగా తెలియజేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు అందని అర్హులను గుర్తించి క్యాంపులకు తీసుకొచ్చి వారికి లబ్ధిచేకూరేలా చూడాలన్నారు. జగనన్న సురక్షలో భాగంగా 11 రకాల సేవలైన ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, ఆదాయ, జనన, మరణ, కుటుంబ ధ్రువపత్రాలు, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, మొబైల్ ఫోన్ అనుసంధానం, భూముల మ్యుటేషన్, తదితర సేవలను గ్రామానికి వచ్చి అందజేస్తామన్నారు. జగనన్న సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సేవలను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బయ్య, ఆర్ఐ జీవన్, తదితరులు పాల్గొన్నారు.



కోవూరు: జగనన్న సురక్షను పరిశీలిస్తున్న ఆర్డీఓ మలోలా



ఇందుకూరుపేట: జగనన్న సురక్షను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్



బుచ్చిరెడ్డిపాళెం: జగనన్న సురక్షను పరిశీలిస్తున్న జేసీ కూర్మనాథ్

వెంకటాచలం: సాంకేతిక సమస్యలను పరిష్కరించాలనే ఆలోచనతోనే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని సచివాలయాల మండల కన్వీనర్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి మందల వెంకటశేషయ్య పేర్కొన్నారు. వెంకటాచలం పంచాయతీ పరిధిలోని గణేష్‌గార్డెన్స్‌లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, వలంటీర్లతో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ కన్వీనర్ నరేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: జగనన్న సురక్షలో భాగంగా ప్రజలకు ఉచితంగా 11 రకాల ప్రభుత్వ సేవలను అందజేయనున్నట్లు జేసీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని 5వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జగనన్న సురక్షలో భాగంగా ఇప్పటి వరకు ప్రభుత్వ పథకాలు అందని అర్హులను గుర్తించి అందేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. రేషన్ కార్డు, జనన, కుల, ఆదాయ సర్టిఫికెట్లు, పట్టాదారు పాస్ పుస్తకాలు వంటి దాదాపు 11 సర్వీసులను ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. ఆయన వెంట కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ సుధీర్, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ షాహుల్ ఉన్నారు.

➡ నగర పంచాయతీలోని నాల్గో వార్డులోని బాలకృష్ణానగర్, గిరిజన కాలనీలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పరిశీలించారు.

కోవూరు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సమష్టిగా విజయవంతం చేయాలని నెల్లూరు ఆర్డీఓ మలోలా, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి అన్నారు. మండలంలోని చెర్లోపాళెంలో జగనన్న సురక్ష సర్వేను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పద్మజ, ఆర్ఐ రమణయ్య, వీఆర్వోలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొడవలూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు వస్తున్నాయని ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని ఆలూరుపాడులో జగనన్న సురక్ష సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను ఇంటి వద్దే అందజేస్తుందన్నారు. కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ ధ్రువీకరణలతో పాటు ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ, పంట సాగుహక్కు పత్రం, కొత్త బియ్యం కార్డు, హౌస్ హోల్డ్ మ్యాపింగ్, విభజన, మ్యుటేషన్ లావాదేవీలను ఎలాంటి ప్రయాసలు లేకుండా పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ రమేష్, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్వే ప్రారంభం

పొదలకూరు : మండలంలో జగనన్న సురక్ష సర్వేను శనివారం ప్రారంభించారు. తొలిరోజు డేగపూడి సచివాలయం పరిధిలో తహసీల్దార్ కే వీరవసంతరావు, బిరదవోలు సచివాలయం పరిధిలో ఎంపీడీఓ టీ నగేష్‌కుమారి పర్యటించి సర్వే నిర్వహించారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను అడిగితెలుసుకున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను ఇంటి వద్దే అందించనున్నట్లు వారు తెలిపారు. అనంతరం సచివాలయ సిబ్బందికి జగనన్న సురక్ష సర్వేపై దిశానిర్దేశం చేశారు. బిరదవోలులో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నెల్లూరు డీఎల్‌పీఓ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. నోడల్ ఆఫీసర్‌గా ఈఓఆర్డీ నరసింహారెడ్డి వ్యవహరించారు.



కొడవలూరు: సర్వేను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ



పొదలకూరు: డేగపూడిలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ వీరవసంతరావు



జగనన్న సురక్షపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ



వెంకటాచలం: ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న మందల వెంకటశేషయ్య

ఈఓపీఆర్డీగా కల్పన సేవలు ఎనలేనివి

కోవూరు: మండల ఈఓపీఆర్డీగా పనిచేస్తూ ఎంపీడీఓగా పదోన్నతి పొంది బదిలీపై ప్రకాశం జిల్లాకు వెళ్లిన బీ కల్పనను డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఓపీఆర్డీగా కల్పన అందించిన సేవలను కొనియాడారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, ఎంపీడీఓ శ్రీహరి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ లక్ష్మీకుమారి, ఎంపీటీసీలు విజయసేనారెడ్డి, రమాదేవి, శ్రీహరి, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.



కల్పనను సన్మానిస్తున్న నిరంజన్‌బాబురెడ్డి

పశుబీమాను సద్వినియోగం చేసుకోవాలి

పొదలకూరు : పాడి రైతులు పశుబీమాను సద్వినియోగం చేసుకోవాలని వైస్‌ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. మరుపూరులో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువిజ్ఞాన బడిని శనివారం నిర్వహించారు. గొర్రెలు, దూడలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ పాడిరైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పశుబీమాను అమలు చేస్తోందని తెలిపారు. పొదలకూరు ఏడీ కే అరుణ మాట్లాడుతూ పాడి పశువుల్లో వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. రైతులు మంచి పాల దిగుబడులు సాధించేందుకు గేదెలకు దాణాను ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నేలటూరు నాగయ్య, తోడేరు పశువైద్యాధికారి ఎస్ శిరీష, జేవీఓ జీ డానియేల్, గోపాలమిత్ర శ్రీను, గొర్రెల కాపర్లు పాల్గొన్నారు.



నట్టల నివారణ మందు పంపిణీని ప్రారంభిస్తున్న వైస్‌ఎంపీపీ, ఏడీ

ఇళ్ల పట్టాల పంపిణీపై రాద్ధాంతం తగదు

తోటపల్లిగూడూరు: జగనన్న కాలనీ లేఅవుట్లలో అర్హులకు నివేశన స్థలాల పంపిణీపై రాద్ధాంతం చేయడం టీడీపీ నాయకులకు తగదని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ఇటీవల తోటపల్లి పంచాయతీ డక్కులవారిపాళెంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నెల్లిపూడి వేణమ్మ, దారా పాలమ్మ నివేశన స్థలాల కోసం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి కాకాణి డక్కులవారిపాళెం లేఅవుట్‌లో ఖాళీగా ఉన్న రెండు ప్లాట్లను కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో రెవెన్యూ అధికారులు గ్రామంలో విచారించి ఇద్దరికి ఇంటి పట్టాలను మంజూరు చేశారు. కాగా టీడీపీ నాయకుల ప్రోద్బలంతో గ్రామానికి చెందిన కొందరు ఇది అన్యాయమంటూ రాద్ధాంతానికి దిగారు. అర్హులకు పట్టాలిస్తే తప్పేంటని స్థానిక గ్రామ వలంటీర్ రాయపు రాము ప్రశ్నించగా టీడీపీ మద్దతుదారులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. దీనిపై స్పందించిన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంబేటి వీరరాఘవులు, దారా హరికృష్ణ బాధితులతో కలిసి లేఅవుట్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామంలో కొందరు టీడీపీ నేతలు అనవసరంగా గొడవలను సృష్టిస్తున్నారన్నారు. ఖాళీ ప్లాట్లను అర్హులకు కేటాయించినా అనవసర రాద్ధాంతం చేస్తూ గందరగోళంగా సృష్టించడం తగదన్నారు. టీడీపీ నేతలు వాస్తవాలను గ్రహించి సర్దుకుపోవాలన్నారు. లేని పక్షంలో గ్రామస్తుల సహకారంతో సదరు టీడీపీ నేతలకు గట్టి బుద్ధి చెబుతామని హెచ్చరించారు.



విలేకరులకు సమస్యను విన్నవిస్తున్న బాధితులు